సాక్షి
జనగామ
మంగళవారం । 14 । మే । 2024



మూడు గుట్టలు..16 కిలోమీటర్లు..
ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పెనుగోలు ఓటర్లు మూడు గుట్టలు దిగివచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు. - 8లో



సూర్యప్రభవాహనంపై అమ్మవారి ఊరేగింపు
శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37^0/26^0
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి పూట ఉక్కపోత కొంత మేర ఉంటుంది.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ చేతకాని తనానికి నిదర్శనం



జనగామ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రాజకీయ విలువలను మంటగలుపుతూ బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేయడం ఆ పార్టీ చేతకాని తనానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ, ప్రెస్టన్ పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను కాంగ్రెస్ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకి ఓటు వేయాలని చెబుతూ పార్టీని నమ్ముకున్న కేడర్ మనోభావాలను కించ పరిచారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ఆయన కూడా బీజేపీ కండువా కప్పు కోవచ్చుకదా ఎద్దేవా చేశారు.

మూడోసారి మోదీ హవా



జనగామ: దేశంలో మూడోసారి నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతున్నదని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రం ప్రెస్టన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. మోదీ సంక్షేమ పాలన, దేశ అభివృద్ధి గెలిచేలా చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, కేవీఎల్‌ఎన్.రెడ్డి, మహంకాళి హరిశ్చంద్రగుప్త, అనిల్‌గౌడ్, సొద రమేష్ చంద్రయ్య, జగదీష్ తదితరులు ఉన్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్



రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజావిశ్వాసం పూర్తిగా కోల్పోయిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. సోమవారం ఖిలాషాపూర్‌లో సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత విలేకరులతో మాట్లాడారు. మాయమాటలు, సాధ్యం కాని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని విమర్శించారు. వై.కుమార్‌గౌడ్, మహిపాల్ రెడ్డి, జిట్టి వీరస్వామి, కొడిదేటి శంకర్, కావటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



చిల్పూరు: బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగేలా కార్యకర్తలు కృషి చేయడం అభినందనీయమని పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. వంగాలపల్లిలో సోమవారం సాయంత్రం జిల్లా నాయకుడు ఇల్లందుల సుదర్శన్‌తో కలిసి ముఖ్య కార్యకర్తలను కలుసుకున్నారు. గంటె ఉపేందర్‌యాదవ్, మాజీ సర్పంచ్ అరూరి ప్రణితప్రదీప్, కాదుగాయ రమేష్, తోకల సంపత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సదానందం, అర్కాల రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఆదరించారు



బచ్చన్నపేట : ప్రజలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, ఆరు గ్యారంటీలకు పట్టం కట్టారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. మండల పరిధి బండనాగారం, కట్కూర్, బచ్చన్నపేట తదితర గ్రామాల్లో పర్యటించి ఎన్నికల సరళిని పరిశీలించారు. అలాగే యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి గ్రామాల్లో పర్యటించి ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. నూకల బాలరెడ్డి, జంగిటి విద్యానాథ్, ఇప్ప శ్రీధర్‌రెడ్డి, చల్ల రమేష్‌రెడ్డి, రాములు, స్వామి, మామిండ్ల చందు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లా కేంద్రం అంబేద్కర్ నగర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు దీరిన ఓటర్లు





ఓటింగ్ 74.86 %



పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతం
- అసెంబ్లీ కంటే పోలింగ్ తక్కువ నమోదు
- మహిళా ఓటర్లదే పైచేయి
- రికార్డు స్థాయిలో వృద్ధులు, దివ్యాంగుల ఓట్లు
- పలు ప్రాంతాల్లో రాత్రి 7.30 వరకు పోలింగ్
- కలెక్టరేట్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరిన ఈవీఎంలు

జనగామ: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఉద్రిక్తతలు మినహా.. ప్రశాంతంగా ముగిసింది. నిప్పులు చెరిగిన సూరీడు అకాల వర్షంతో చల్లబడడంతో సోమవారం జరిగిన ఎంపీ ఎలక్షన్స్‌లో పోలింగ్ శాతం పెరగడానికి దోహదపడింది. 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం పెరగ్గా.. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే 10 శాతం తక్కువగా నమోదైంది. ఓటుకు నోటు తగ్గడంతో బతుకు దెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లిన ఎన్నో కుటుంబాలు ఓటు వేయడానికి సొంతూరికి రాకపోవడం.. చాలా చోట్ల ఈవీఎంల మొరాయింపుతో చాలా మంది వెనుదిరగడంతో ఒకటి, రెండు శాతం ఓటింగ్ తగ్గి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఘన్‌పూర్ అత్యధికం.. పాలకుర్తి అత్యల్పం

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 7,52,395 ఓట్లు ఉండగా, 5,63,218(74.86శాతం) ఓట్లు పోలైనట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. అత్యధికంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో 78.54 శాతం, అత్యల్పంగా పాలకుర్తిలో 71.35శాతం నమోదైనట్లు వెల్లడించారు. ఓవరాల్ ఓటింగ్‌లో మహిళలదే పైచేయిగా నిలిచింది. కాగా 2019 ఎంపీ ఎన్నికల్లో 68.26 శాతం ఓటింగ్ నమోదు కాగా.. ఈసారి 6.6శాతం ఎక్కువగా నమోదైంది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 85.71శాతం పోలింగ్ కాగా.. ఈ ఎన్నికల్లో 10.85 శాతం మేర తగ్గింది.

ఉదయం 7 గంటలకే బారులు..

జిల్లాలో ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించారు. 7 గంటలకు రెగ్యులర్ ఓటింగ్ మొదలు కాగా.. చాలా చోట్ల అప్పటికే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు దీరారు. అయితే.. 40 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైన పరిస్థితుల్లో.. ఓటింగ్‌కు ఒక్కరోజు ముందు కురిసిన అకాల వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ఓటర్లు ఇబ్బంది లేకుండా క్యూలో గంటల తరబడి నిలబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా, ఎంపీ అభ్యర్థులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, క్యామ మల్లేశం, కడియం కావ్య, అరూరి రమేష్, ఎం.సుధీర్‌కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు తాటికొండ రాజయ్య, పొన్నాల లక్ష్మయ్య, కాంగ్రెస్ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. కాగా డీసీపీ పి.సీతారాంతో కలిసి సీపీ అంబర్ కిషోర్‌ఝా జిల్లాలో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో రిసెప్షన్ సెంటర్‌ను స్టేట్ ఎలక్షన్ అబ్జర్వర్ పరిశీలించారు.



కలెక్టరేట్ కంట్రోల్ రూం నుంచి పోలింగ్ సరళి పరిశీలిస్తున్న అధికారులు



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

కలెక్టరేట్ నుంచి పర్యవేక్షణ

కలెక్టరేట్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ కంట్రోల్ రూం నుంచి జిల్లాలో జరిగిన ఎన్నికల పోలింగ్ సరళిని కలెక్టర్ రిజ్వాన్‌బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఎలక్షన్ సెల్ అధికారులు మానిటరింగ్ చేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి రిసెప్షన్ సెంటర్‌ను కలెక్టర్ సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా రిసీవ్ చేసుకుని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలన్నారు. ఆయన వెంట ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల ఓటర్ల రికార్డు..



ఓటు వేయడానికి వస్తున్న వృద్ధులు

జిల్లాలో దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధుల ఓటింగ్ శాతం రికార్డు స్థాయిలో నమోదైయిందని కలెక్టర్ వివరించారు. పోలింగ్‌లో 93.55 శాతం నమోదు కాగా, మూడు నియోజకవర్గాల్లోని 869 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,63,83 దివ్యాంగ ఓటర్లకు గాను 1,55,79(95.12శాతం) మంది ఓటు వేశారు. అలాగే 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు 6,844 మంది ఉండగా.. 6,151(90.03 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నేడు ఎన్నికల సిబ్బందికి సెలవు

పోలింగ్ విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి నేడు(మంగళవారం) ప్రత్యేక సాధారణ సెలవుగా భారత ఎన్నికల సంఘం ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

జనగామ: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా సోమవారం పట్టణంలోని హనుమకొండరోడ్డులోని ప్రెస్టన్ స్కూల్ పోలింగ్ బూత్‌లో సతీమణితో కలిసి క్యూలో నిలబడి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే పట్టణంలోని సిద్దిపేట రోడ్డు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల బూత్ 232లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, 233 బూత్‌లో సతీమణి నీలిమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కుమారుడు, కాంగ్రెస్ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి జెడ్పీ హైస్కూల్ బూత్‌లో ఓటు వేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి తన కుమారుడితో కలిసి రైల్వేస్టేషన్ ఆవరణ ప్రభుత్వస్కూల్ పోలింగ్ కేంద్రంలో, టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి వీరన్నపేటలో, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఇ వేణుమాధవ్ దంపతులు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ సుధాసుగుణాకర్ దంపతులు జనగామలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.



ఓటుహక్కు వినియోగించుకున్న కలెక్టర్ దంపతులు



శివునిపల్లి పోలింగ్ కేంద్రంలో సీపీ అంబర్ కిశోర్ ఝా..

అసెంబ్లీ నియోజకవర్గాల్లో (సాయంత్రం 6 గంటలవరకు) నమోదైన పోలింగ్ శాతం

నియోజకవర్గం	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
జనగామ	2,42,771	1,81,328	74.69
స్టేషన్‌ఘన్‌పూర్	2,54,110	1,99,581	78.54
పాలకుర్తి	2,55,514	1,82,309	71.35
పరకాల	...	...	72
వరంగల్ పశ్చిమ	...	...	50.27
వరంగల్ తూర్పు	...	...	63.05
వర్ధన్నపేట	...	...	71.04
భూపాలపల్లి	...	...	67.68

(ఈ సంఖ్య మారుతుందని ఎన్నికల అధికారులు ప్రకటించారు)

రాత్రి 7.30 వరకు పోలింగ్

జిల్లా వ్యాప్తంగా రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. పట్టణంలోని ప్రెస్టన్ స్కూల్ పోలింగ్ కేంద్రానికి పలువురు ఓటర్లు సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత రావడంతో అధికారులు లోనికి అనుమతించకపోవడంతో ఓటు వేయకుండానే వెనుదిరిగారు. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ మండలం, జిల్లా కేంద్రంలో రాత్రి ఏడు గంటలు దాటినా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు దీరారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఆయా రాజకీయ పార్టీల ప్రచారంతో హోరెత్తించగా, కొంత మంది డబ్బులు రాలేదంటూ అడగడం కనిపించింది. రాత్రి పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలతో పాటు పీవో, ఏపీవో, ఓపీవోలు ప్రత్యేక బస్సుల్లో పోలీసు బందోసబ్తు నడుమ జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి డిస్ట్రిబ్యూషన్ పాయింట్లకు చేరుకున్నారు. అక్కడి నుంచి తెల్లవారుజామున భువనగిరి, వరంగల్‌లో ఉన్న స్ట్రాంగ్ రూంలకు తరలించారు.



ఈవీఎంలతో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరిన సిబ్బంది




ఘన్‌పూర్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటర్లకు నమస్కరిస్తున్న అభ్యర్థి కడియం కావ్య

వరంగల్ పార్లమెంట్‌లో పోలింగ్ సరళి ఇలా..

సమయం	పోలింగ్ శాతం
7–9	8.97
9–11	24.48
11–01	41.23
1–3	54.17
3–5	64.08
5–6	67.49

గత, ప్రస్తుత ఎన్నికల్లో పోలింగ్‌శాతం



2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 3.80 శాతం పెరిగింది.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో అత్యధికంగా **78.54** శాతం

అత్యల్పంగా వరంగల్ పశ్చిమలో **50.27** శాతం పోలింగ్

మంచి భవిష్యత్‌కే తొలి ఓటు
- మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత మనోగతం - వివరాలు 8లో

ఓటెత్తారు - ఫొటోలు 8,9లో

ప్రముఖులు ఓటేశారు - ఫొటోలు 10లో

మండలాల వారీగా పోలింగ్ శాతం

మండలం	పర్సంటేజీ	మండలం	పర్సంటేజీ
కొమురవెల్లి	77.11	జనగామ రూరల్	73.00
చేర్యాల	72.31	నర్మెట	76.89
దూల్మిట్ట	75.00	స్టేషన్‌ఘన్‌పూర్	78.54
తరిగొప్పుల	76.76	జనగామ అర్బన్	74.00
రఘునాథపల్లి	76.45	దేవరుప్పుల	78.00
బచ్చన్నపేట	71.85	లింగాలఘణపురం	79.16
మద్దూరు	72.56	పాలకుర్తి	72.17
జఫర్‌గఢ్	75.34	చిల్పూరు	72.06

ఈవీఎంల మొరాయింపు

- అర గంట నుంచి రెండు గంటల పాటు ఆలస్యంగా పోలింగ్

జనగామ: జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ఈవీఎం, వీవీప్యాడ్‌ల మొరాయింపుతో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈవీఎంలను తనిఖీ చేసిన తర్వాతే పోలింగ్ కేంద్రాలకు తరలించగా.. మాక్ పోలింగ్ సమయంలో సాంకేతిక సమస్య తలెత్తి పోలింగ్ అరగంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా మొదలైయింది. జనగామ నియోజకవర్గం పరిధి మద్దూరు మండలం లద్నూరు 102 బూత్, చేర్యాల మండలం ఆకునూరు 32వ బూత్, చిల్పూరు మండలం నష్కల్ 103 బూత్‌లో ఈవీఎంలు, కొమురవెల్లి మండలం కిష్టంపేట పోలింగ్ కేంద్రంలో వీవీప్యాట్ మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది.

బటన్ లాక్.. రెండు గంటలు నిలిచిన పోలింగ్
జనగామ వ్యవసాయ మార్కెట్ 11వ వార్డు పరిధి 240 పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ లాక్ కావడంతో మధ్యాహ్నం 12.45 గంటలకు పోలింగ్ నిలిపి వేశారు. టెక్నీషియన్లు వచ్చి సమస్య పరిష్కరించాక అరగంట పాటు పనిచేసిన ఈవీఎంలు మరోసారి ఆగిపోయాయి. రెండు గంటల పాటు నిరీక్షించిన ఓటర్లు చాలా మంది ఓటు వేయకుండానే ఇళ్లకు వెళ్లి పోయారు. మధ్యాహ్నం 1.55 గంటలకు తిరిగి పోలింగ్ ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ప్రభుత్వ కళాశాల 244 బూత్‌లో ఈవీఎం గుర్తుపై ఇంకు మరక ఉండడంతో ఓ ఓటరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో అధికారులు ఆ మరకను తుడిచి వేశారు. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల 232 పోలింగ్ బూత్‌లో వెలుతురు సరిగా లేక బ్యాలెట్ యూనిట్‌లో గుర్తులు కనిపించకపోవడంతో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధ ఓటర్లు టార్చ్‌లైట్ వెలుతురులో ఓటు వేయాల్సి వచ్చింది. జనగామ మండలం గానుగుపహాడ్ 210, పెద్దపహాడ్ 208 బూత్‌లలో ఈవీఎంలు మొరాయించగా పోలింగ్ అరగంట నిలిచింది.



జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఈవీఎం మొరాయించడంతో నిరీక్షిస్తున్న ఓటర్లు

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి మధ్య వాగ్వాదం
- జనగామ ధర్మకంచలో ఉద్రిక్తత
- గానుగుపహాడ్‌లో పోలీసుల లాఠీ చార్జ్
- నిరసన వ్యక్తం చేసిన ఓటర్లు, నాయకులు

జనగామ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌లోకి అనుమతి విషయమై కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ బాలికల ఉన్నత పాఠశాల 263 బూత్‌లో పోలింగ్ పర్సంటేజీ పరిశీలించేందుకు కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి వెళ్లగా.. బీఆర్‌ఎస్ బూత్ ఏజెంట్ ప్రవీణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి తరపున ఎలక్షన్ ఆథరైజ్డ్ పర్సన్‌గా వచ్చానని చెప్పే క్రమంలో మాటా మాటా పెరిగింది. బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన అక్కడికి చేరుకున్న సమయంలోనే ప్రశాంత్‌రెడ్డి బయటకు వస్తూ ఎదురుపడ్డారు. ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారనుండగా.. అక్కడే ఉన్న ఏసీపీ అంకిత్‌కుమార్, సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు ఇరువురికి నచ్చజెప్పారు. రెండు వర్గాలను పంపించి పోలింగ్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం డీసీపీ సీతారాం చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు.



ధర్మకంచ పోలింగ్ కేంద్రం వద్ద గొడవపడుతున్న ఎమ్మెల్యే పల్లా, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి

గానుగుపహాడ్‌లో లాఠీచార్జ్
జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామ కూడలిలో డమ్మీ ఈవీఎంలతో పాటు పార్టీల తరపున ప్రచారం చేస్తున్న పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు చెరదగొట్టారు. టెంట్లు కూల్చివేసి, లాఠీలతో కొట్టడంతో దుర్గామాత ఆలయ పూజారి రెడ్డబోయిన నర్సయ్యతో పాటు మరి కొందరు స్వల్పంగా గాయపడ్డారు. సీఐ వచ్చీ రావడంతోనే కొట్టారని బాధితులు గాయాలు చూపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటపై పలువురు ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు. లాఠీ చార్జ్ ఘటనను ఎలక్షన్ కమిషన్ సుమొటోగా తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి డిమాండ్ చేశారు. సీఐ రఘుపతిరెడ్డి మాట్లాడుతూ తాము ఎవరిపైనా లాఠీ చార్జ్ చేయలేదని, డమ్మీ ఈవీఎంలతో ప్రచారం చేస్తుంటే వద్దని చెప్పడంతో దురుసుగా ప్రవర్తించారని, ఈ విషయమై బీజేపీ నాయకులు శానబోయిన మహిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా మద్దూరు మండలం బైరాన్‌పల్లి, చేర్యాల పట్టణంలో కాంగ్రెస్–బీఆర్‌ఎస్ పార్టీల నాయకుల మధ్య చిన్న పాటి ఘర్షణ చోటుచేసుకుంది. అలాగే జనగామ మండలం పెంబర్తిలో కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పోలింగ్ బూత్‌లోకి వెళ్లే క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రావడంతో గొడవ సద్దుమణిగింది.



గానుగుపహాడ్‌లో చెదరగొడుతున్న పోలీసులు

వరంగల్‌లో ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి బారులుదీరిన ట్రాన్స్‌జెండర్లు





జనగామ స్టేషన్ రోడ్ హైస్కూల్‌లో..



ఖానాపురం: బుధరావుపేటలో బారులుదీరిన ప్రజలు



ఆత్మకూరు : కటాక్షపూర్‌లో క్యూలైన్‌లో ఓటర్లు



చిన్నగూడూరు: ఓటు వేసేందుకు ట్రాక్టర్‌లో వస్తున్న గిరిజనులు

పోల్.. కూల్..

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం 7 గంటల ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4గంటలకే ముగిసింది. ఓటు వేయడానికి ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. దివ్యాంగులు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్‌చైర్‌లు, ఆటోల ద్వారా తరలించి ఓటు వేయించారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



పర్వతగిరి : వృద్ధుడికి బూత్ వివరాలు తెలుపుతున్న తహసీల్దార్



గుంటూరుపల్లిలో బారులుదీరిన ఓటర్లు



భూపాలపల్లి రూరల్: రామయ్యపల్లిలో బారులుదీరిన ఓటర్లు



జనగామ అంబేద్కర్ నగర్‌లో బారులుదీరిన ఓటర్లు

ఓటు.. భవిష్యత్‌కు పునాది



ఓటు హక్కు.. దేశ భవిష్యత్‌కు పునాది. స్థానిక సంస్థల నుంచి మొదలు.. లోక్‌సభ వరకు దేశ భవితవ్యం నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఇందులో పౌరులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ ఓటు అనే వజ్రాయుధం ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే దేశం అభివృద్ధిలో పయనిస్తుంది. లేనిపక్షంలో భవిష్యత్‌లో అంధకారం నెలకొంటుంది. కాగా, దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

- ఖిలా వరంగల్/వరంగల్/మహబూబాబాద్ రూరల్/ భూపాలపల్లి రూరల్

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఓటు వజ్రాయుధం



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. ఓటు వజ్రాయుధం. ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపునిచ్చింది. యువ ఓటర్లలో వచ్చిన చైతన్యమే మంచి నేత విజయానికి తోడ్పాటు అందిస్తుంది. - లైలా, ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ ప్రతినిధి

తొలి ఓటు వేయడం ఆనందంగా ఉంది



ఓటు హక్కు వచ్చిన తర్వాత తొలిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. నా తొలి ఓటును ప్రజా సమస్యలు తీర్చే, అభివృద్ధి చేసే, నీతి, నిజాయితీ గల మంచి నాయకుడిని ఎంచుకొనేందుకు వేశా. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది. - ఎస్.సునాయన దీప్తి, శివనగర్, వరంగల్

అభివృద్ధికే నా తొలి ఓటు



అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చిన నాయకుడికి నాతొలి ఓటు వేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుత రాజకీయాల్లో అవినీతి, బంధు ప్రీతి, స్వార్థాన్ని నివారించాలంటే నిజాయితీ గల నాయకులను గెలిపించాలి. అందుకు యువత తమ చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధాన్ని సమర్థంగా వాడుకోవాలి. భవిష్యత్‌లో మంచి రాజకీయ వ్యవస్థను నిర్మించే బాధ్యత యవతరంపైనే ఉందని నా అభిప్రాయం.

- మునుగోటి మిథిలి, పెరకవాడ వరంగల్

ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం



ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. నేను కూడా సమాజంలో గుర్తింపు పొందా. ఎదుటి వారికి ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేస్తాననే నమ్మకం కలిగింది. ఓటు హక్కుతో మంచి ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలి.

- గుగులోత్ అంకిత, మహబూబాబాద్

సంతోషంగా ఉంది



మొదటి సారిఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. రాజ్యాంగం.. ఓటు ద్వారా మనకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే గొప్ప అవకాశం కల్పించింది. ఓటు విలువైంది.

- రాంనేని భార్గవి, గొర్లవీడు, భూపాలపల్లి

మంచి నేతకు తొలి ఓటు వేశా



వరంగల్ శివనగర్ ప్రకాశ్ మెమోరియల్ హైస్కూల్‌లోని 167వ పోలింగ్ బూత్‌లో నా తొలి ఓటు హక్కు వినియోగించుకున్నా. నిజాయితీ గల మంచి నాయకుడికి ఓటు వేశా. అభివృద్ధిని ఆకాంక్షించి మంచి నాయకుడి గెలుపునకు ఓటు వేశా.

- శామంతుల తేజ్ దీప్తి, శివనగర్

ఓటు హక్కు గొప్పది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గొప్పది. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నా. ప్రజలకు సేవ చేసే నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే గొప్ప అవకాశం రాజ్యాంగం మనకు కల్పించింది.

- గోరంటల మణిచరణ్, బీటెక్, ఫైనలియర్, వరంగల్

మంచి నాయకుడిని ఎన్నుకోవడం అదృష్టం



నేను మొదటిసారి ఓటు వేసినందుకు గర్వపడుతున్నా. ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి నా ఓటు హక్కు దోహదపడింది. దేశానికి సేవ చేసే ప్రజాప్రతినిధులు.. ఎన్నికైన అనంతరం అందరికీ మేలు చేయాలి. అదే నా కోరిక.

- గుగులోత్ నిఖిత, మహబూబాబాద్

ఓటు కోసం ఖండాతరాలు దాటిన ఎన్‌ఆర్‌ఐ..

- స్ఫూర్తి నింపిన విష్ణువర్ధన్‌రెడ్డి



సిరా చుక్క చూపుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

గీసుకొండ : ఓ ఎన్‌ఆర్‌ఐ ఓటు విలువ చాటి చెప్పాడు. అమెరికాలో ఉన్న తాను ఓటు హక్కు వినియోగించుకుని పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన వీరాటి రవీందర్‌రెడ్డి, స్వర్ణ దంపతుల కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ చదవడానికి అమెరికాలో వెళ్లాడు. ఎంఎస్ పూర్తి చేసి ఐదేళ్లుగా అమెరికాలోనే ఉంటూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ఉన్నాయని తెలిసి ఐదు రోజుల క్రితం ఓటు వేయడానికి స్వగ్రామం వచ్చాడు. అమెరికా నుంచి రానుపోను ఫ్లైట్ చార్జీలు రూ. 2 లక్షలు చెల్లించి సోమవారం కొమ్మాలలో ఓటు వేశాడు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

కమలాపూర్‌లో మరో యువకుడు..



ఓటు హక్కు వినియోగించుకున్న సందీప్

కమలాపూర్: కమలాపూర్‌కు చెందిన మాట్ల సందీప్ అమెరికా నుంచి వచ్చి తన స్వగ్రామం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన మాట్ల శంకర్, సరోజన దంపతుల రెండో కుమారుడు సందీప్ ఉన్నత చదువు నిమిత్తం ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లాడు. తెలంగాణలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అమెరికా నుంచి వచ్చి ఓటు వేశాడు. తాను కేవలం ఓటు హక్కు వినియోగించుకోవడం కోసమే అమెరికా నుంచి వచ్చినట్లు తెలిపాడు. కాగా, సందీప్‌ను పలువురు అభినందించారు.

ఓటు వేసి ఇంటికి వచ్చి అనంతలోకాలకు..

- గుండెపోటుతో మహిళ మృతి



వీరమ్మ(ఫైల్)

నర్సింహులపేట: ఓటు వేసి ఇంటికి వచ్చిన అనంతరం ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని కొమ్ములవంచలో జరిగింది. గ్రామానికి చెందిన దొంతు వీరమ్మ (58) తన కుమారుడు అశోక్‌తో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసింది. తిరిగి ఇంటికి రాగానే గుండెపోటుకు గురై మృతి చెందింది. వీరమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మూడు గుట్టలు..16 కిలోమీటర్లు..

- కాలినడకన వచ్చి ఓటు వేసిన పెనుగోలు వాసులు



ఓటు వేయడానికి వస్తున్న పెనుగోలు గిరిజనులు

వాజేడు: అది గుట్టలపై ఉన్న ఆదివాసీల కుగ్రామం. మండల పరిధిలోని కొంగాల గ్రామ పంచాయతీలో ఉన్న పెనుగోలు. ఇక్కడ 12 కుటుంబాలు, 30 మంది జనాభా ఉంది. ఈ గ్రామంలో 22 మంది ఓటర్లు ఉన్నారు. రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును క్రమం తప్పకుండా వినియోగించుకుంటున్న వీరు.. సోమవారం కూడా మూడు గుట్టలు దిగి వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు. గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామం నుంచి కాలి నడకన గుమ్మడి దొడ్డి వరకు 16 కిలో మీటర్లు వచ్చిన వారిని.. తహసీల్ కార్యాలయ సిబ్బంది ఆటో ద్వారా జంగాలపల్లి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఓటు వేసిన తరువాత వారు విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలని గుట్టలు దిగి వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు.

ఓటు వేసిన వీడియో వైరల్..

- వ్యక్తిపై కేసు నమోదు



హేమ్లాతండాలో ఘర్షణ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

నెల్లికుదురు : మండలంలోని హేమ్లా తండాలో ఓ వ్యక్తి ఓటు వేస్తూ వీడియో తీశాడు. అనంతరం సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరలైంది. ఈ ఘటనలో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ సోమవారం తెలిపారు. తండాలోని 160 పోలింగ్ కేంద్రంలో తండాకు చెందిన బానోత్ బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తున్న వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య పోలింగ్ కేంద్రం సమీపంలో స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎస్. నాగరాజు ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

మానుకోటలో యువకుడిపై..

మహబూబాబాద్ రూరల్ : తాను ఓ పార్టీకి ఓటు వేసిన దృశ్యాలను ఓ యువకుడు సోషల్ మీడియాలో పోస్టు చేయగా అతడిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురం గ్రామానికి చెందిన దేవనబోయిన శ్రీకాంత్ స్థానిక పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అదేవిధంగా తాను ఏ పార్టీకి ఓటు వేశాడో అనే విషయ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వీరన్న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

వీవీ ప్యాట్ ఫొటో వైరల్



వాట్సాప్‌లో వైరలైన వీవీ ప్యాట్‌లోని ఫొటో

సంగెం: మండలంలోని ఎల్గూర్‌స్టేషన్‌లోని 211 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో వచ్చిన ఫొటో తీసి గుగులోత్ గోపి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశాడు. దీంతో అతడిపై చర్య తీసుకోవాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల సెక్టార్ అధికారి సాయిరాజ్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సెక్టార్ అధికారి సాయిరాజ్ తెలిపారు.

పోలింగ్ బహిష్కరించిన చింతలగడ్డ వాసులు

- బూత్ ఏర్పాటు చేయకపోవడంపై నిర్ణయం
- 295 ఓట్లకు గానూ 15 మందే ఓటు హక్కు వినియోగం



నిరసన వ్యక్తం చేస్తున్న చింతలగడ్డతండా ఓటర్లు

మరిపెడ రూరల్: సుదూర ప్రాంతంలో ఉన్న తమ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కొద్ది రోజులుగా విన్నవించినా తమ మాటను అధికారులు లెక్క చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ మండలం చింతలగడ్డ తండా వాసులు సోమవారం పోలింగ్ బహిష్కరించారు. తాళ్లఊకల్ రెవెన్యూ పరిధిలోని చింతలగడ్డతండా, రేఖ్యతండా, రూప్‌సింగ్‌తండాను కలిపి చింతలగడ్డతండా జీపీగా ఏర్పాటు చేశారు. 295 ఓట్లు ఉన్న చింతలగడ్డతండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని 20 రోజులుగా అధికారులకు విన్నవిస్తే పట్టించుకోలేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రూప్‌సింగ్ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి నడవలేక పోతున్నామని, కావాలనే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓటు వేయడానికి వెళ్లమని తండావాసులు మొండికేశారు. విషయం తెలుసుకున్న మరిపెడ తహసీల్దార్ సైదులు, సీఐ హతిరాంనాయక్, ఎస్సై షేక్ తాహేర్‌బాబా.. తండాకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ససేమిరా అనడంతో చేసేది లేక ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి తండాకు బూత్ మంజూరయ్యేలా చూస్తామని సర్ది చెప్పి వెనుదిరిగారు. కాగా, అధికారులు వెళ్లాక కేవలం 15 మంది మాత్రమే వెళ్లి రూప్ సింగ్‌తండా పోలింగ్ కేంద్రంలో ఓటు వేసినట్లు తెలిసింది.

సూర్యప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి నిత్యాహ్నికం జరిపి అనంతరం చతుస్థానార్చన సదస్యం నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని సూర్యప్రభవాహనంపై జైభద్రకాళి అంటూ జయజయధ్వానాలు చేస్తుండగా మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛాణలతో ఊరేగించారు. అదే విధంగా సాయంత్రం హంసవాహనంపై ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు బాకరాజు చంద్రశేఖర్‌రావు, రాజశ్రీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.





శ్రీభద్రకాళి అమ్మవారు, సూర్యప్రభవాహనంపై అమ్మవారు

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం



జి వర్ష



తేజస్వి



మేఘన

విద్యారణ్యపురి: సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ మధుకర్‌రెడ్డి, ఎ సంతోష్ తెలిపారు. 500 మార్కులకుగాను జి వర్ష 485, టి సాయి ప్రణవ్‌రెడ్డి 484, ప్రేమ్‌చరణ్‌సాహు 481 మార్కులు, డి శ్రేష్టరెడ్డి 477 మార్కులు సాధించారని వారు తెలిపారు. ఈ విజయానికి కారణం క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్ట ప్రణాళిక, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం అని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

12వ తరగతి ఫలితాల్లో..

సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ మధుకర్‌రెడ్డి, ఎ సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీలో 500 మార్కులకు పి మేఘన 482 , తుమ్మ తేజస్వి 480, రిషికేష్‌రెడ్డి 478 మార్కులు సాధించారని తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

ఏకశిల విద్యాసంస్థల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి

హసన్‌పర్తి: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏకశిల విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. 500 మార్కులకు 483, 479, 479, 478, 477, 476 మార్కులు సాధించినట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కూడా సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థల హవా కొనసాగిందన్నారు. ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఈ ఫలితాలు అన్నారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కేడీ స్వర్ణరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



అరుణ్‌బాబు



ఎం హ ర్షిణి

కాజీపేట అర్బన్ : సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాల్లో గ్రీన్‌వుడ్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, డాక్టర్ గిర్రెం భరద్వాజనాయుడు తెలిపారు. 500 మార్కులకు టి అరుణ్ బాబు 490, ఎం హర్షిణి 489, కె శృతీష్‌రెడ్డి 487, ఇ కారుణ్య 487, కె ప్రీతికారెడ్డి 484, సీహెచ్ వేదజ్ఞ 483 మార్కులు సాధించారన్నారు. 440 మార్కులపైన సాధించిన విద్యార్థులు 65 మంది ఉన్నారని తె లిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు. గ్రీన్‌వుడ్ మేనేజర్ ప్రభుకుమార్, అకడమిక్ ప్రిన్సిపాళ్లు వి నవీన్‌కుమార్, మంజుల, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ టి పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి సురేష్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ షేక్ రబ్బాని మురళి, అకడమిక్ కోఆర్డినేటర్స్ శ్రీకాంత్, హర్ష అభినందించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ఎల్కతుర్తి: అనారోగ్య సమస్య కారణంగా మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళంపల్లిలో జరిగింది. వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దంపు శోభ(42) గతంలో పురుగుల మందు తాగింది. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఎన్ని ట్యాబ్లెట్లు వాడినా తగ్గకపోగ మరింత పెరిగాయి. దీంతో ఈ బాధ భరించలేక మనస్తాపానికి గురైన శోభ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

వడదెబ్బతో కార్మికుడి మృతి

బయ్యారం: వడదెబ్బతో తునికాకు కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధి సింగారంలో జరిగింది. గ్రామానికి చెందిన సూర్నబాక జగ్గయ్య(59) ఆదివారం తునికాకు సేకరణకు వెళ్లాడు. అదే రోజు రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.